రంజాన్ సందర్భంగా కేసీఆర్‌ను కలిసిన చిన్ననాటి స్నేహితుడు



# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం



మహమూద్ అలీ ఇంట్లో రంజాన్ వేడుకలు..



## పర్యాటక కేంద్రాలపై దాడులు చేస్తాం..

- శత్రుదేశాలకు ఇరాన్ హెచ్చరిక



న్యూఢిల్లీ, మార్చి 21: తమ శత్రుదేశాలతోపాటు, అమెరికా, ఇజ్రాయెల్‌కు సహకరించే దేశాల్లోని పర్యాటక కేంద్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఆయా దేశాల్లోని రిక్రియేషనల్ పార్కులు, ఇతర టూరిస్ట్ డెస్టినేషన్స్ లక్ష్యంగా చేసుకుంటామని తెలిపింది. ఈ మేరకు ఇరాన్ సైనిక అధికారి జనలర్ అబోల్ఫాజి షెకార్చి హెచ్చరించారు. అంటే, ఇకపై వైమానిక దాడులే కాకుండా తీవ్రవాద దాడులకు కూడా పాల్పడుతుందా అనే అనుమానాలు మొదలయ్యాయి. ఇదే సమయంలో ఇరాన్‌లోని నంటాజ్ అణుకేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్-అమెరికా సైన్యం దాడులకు పాల్పడింది.నంటాజ్ అణుకేంద్రంపై శనివారం ఉదయం మిస్సైళ్లతో ఇజ్రాయెల్ దాడి చేసింది. అయితే, ఈ దాడుల్లో అణుకేంద్రానికి ఎలాంటి నష్టం జరగలేదని ఇరాన్ ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి లీకేజీ, రేడియేషన్ లేదని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఇరాన్‌కు నంటాజ్ అణుకేంద్రం చాలా కీలకం. ఈ అణుకేంద్రంపై ఇజ్రాయెల్ దాడి చేయడం ఇది రెండోసారి. యుద్ధం ప్రారంభమైన తొలి వారంలోనే ఈ కేంద్రంపై దాడి జరిగింది. అప్పుడు సమీపంలోని కొన్ని బిల్డింగులు ధ్వంసమయ్యాయి. అయితే, అప్పుడు కూడా ఎలాంటి రేడియోధార్మికత విడుదల కావడం లేదని ఇరాన్ సహా ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఈ అణుకేంద్రం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 220 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గత ఏడాది జూన్‌లో జరిగిన వైమానిక దాడుల సందర్భంగా కూడా ఇజ్రాయెల్ ఈ కేంద్రంపై దాడికి పాల్పడింది.ఇరాన్‌పై దాడిని త్వరలోనే ముగిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఈ దాడి జరగడం విశేషం. ఇరాన్ యుద్ధం ప్రారంభమై నాలుగు వారాలకు చేరింది. ఇరాన్‌పై దాడి చేసేందుకు ట్రంప్ దాదాపు 3,000 మంది మెరైన్ సైనికుల్ని మోహరిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఇరాన్.. గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తోంది.

## తమిళనాడులో కొత్త రాజకీయ కూటమి..

- చేతులు కలిపిన రామదాస్, శశికళ



చెన్నై: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తమిళనాడులో మరో కొత్త రాజకీయ కూటమి ఏర్పాటైంది. పట్టాలి మక్కల్ కచ్చి (పీఎంకే) వ్యవస్థాపకుడైన రామదాస్, దివంగత మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలైన శశికళ దీని కోసం చేతులు కలిపారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని ఈ కూటమి యోచిస్తున్నది. విల్లుపురం జిల్లా తైలపురంలోని రామదాస్ నివాసానికి శశికళ వెళ్లారు. కొత్త రాజకీయ కూటమి ఏర్పాటు గురించి సుమారు రెండు గంటల పాటు ఆయనతో చర్చించారు.కాగా, శశికళ సొంతంగా ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కజగం (ఏఐపీటీఎంఎంకే)తో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాము ఒప్పందం కుదుర్చుకున్నట్లు రామదాస్ తెలిపారు. 'ఈ పొత్తు ఇప్పటికే తమిళనాడులో బలమైన ప్రభావాన్ని చూపింది. పలువురు ప్రత్యర్థులను కలవరపరిచింది. మరిన్ని పార్టీలు మాతో చేరుతాయని భావిస్తున్నాం' అని మీడియాతో అన్నారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని తమ కూటమి యోచిస్తున్నదని వెల్లడించారు.మరోవైపు పీఎంకే వ్యవస్థాపకుడైన రామదాస్, ఆయన కుమారుడు అన్బుమణి రామదాస్ మధ్య పార్టీపై నియంత్రణ అంశంలో విభేదాలున్నాయి. అలాగే అన్నాడీఎంకేలో తన ప్రభావాన్ని తిరిగి పొందడానికి శశికళ పోరాడుతున్నారు. పార్టీని ఏకం చేయడంలో విఫలమైన తర్వాత తన సొంత పార్టీ ఏఐపీటీఎంఎంకేను ఆమె ఏర్పాటు చేశారు.అయితే తమ మాతృ పార్టీల్లో అంతర్గత సవాళ్లను ఎందుర్కొంటున్న రామదాస్, శశికళ రాజకీయ ప్రాబల్యం పునరుద్ధరణ, తమ క్యాడర్‌ను పటిష్టం చేసుకోవడానికి ఈ పొత్తును ఒక మార్గంగా భావిస్తున్నారు. దీంతో వీరిద్దరూ కలిసి కొత్త రాజకీయ కూటమిని ఏర్పాటు చేశారు. కాగా, తమిళనాడులో ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరుగనున్నది.

## హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాల తగ్గుదల..



- కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

రాష్ట్రంలోని ఐటీ రంగంలో భారీగా ఉద్యోగాలు తగ్గుదలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాలు తగ్గాయని ప్రభుత్వం ఒక్క వారంలోనే రెండుసార్లు ఒప్పుకోవడం ఆందోళనకరమైన విషయామని అన్నారు.2023లో హైదరాబాద్‌లోని ఐటీ రంగంలో 9.46లక్షల ఉద్యోగాలు ఉండేవని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ 2026 నాటికి అవి 9.39 లక్షలకు తగ్గాయని ప్రభుత్వం ఒప్పుకుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మొదట మార్చి 16న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా వెల్లడించారని చెప్పారు. అనంతరం బడ్జెట్ ప్రవేశపెడుతున్న సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారని మిగతా 2లో..

## ద్రవ్యోల్బణం పెరగొచ్చు

- మోదీ సర్కార్‌కు దిశానిర్దేశం లేదని రాహుల్ విమర్శ



న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. రూపాయి విలువ పతనం, ఇంధనం ధరలు పెరగడం రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు.'డాలర్‌తో పోల్చిస్తే రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. త్వరలోనే అది 100 మార్క్‌ను తాకవచ్చు. పారిశ్రామిక ఇంధనం ధరల్లో స్వల్ప పెరుగుదల చోటుచేసుకుంది. ఇవి కేవలం గణాంకాలు కావు. ద్రవ్యోల్బణం పెరగబోతోందనడానికి సంకేతాలు' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కరెన్సీ పతనం, ధరలు పెరుగుదల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. ఇది సాధారణ పరిస్థితి అని ప్రభుత్వం చెప్పవచ్చు కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉందని, సామాన్యుడి జేబుకు చిల్లుపడుతుందని అన్నారు. సామాన్యుడిపై నాలుగు రకాలుగా ద్రవ్యోల్బణం ప్రభావం పడుతుందని రాహుల్ పేర్కొన్నారు. వస్తువుల ఉత్పత్తి, రవాణా ఖర్చులు పెరుగుతాయని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎస్ఎంఈ) తీవ్ర ప్రభావం పడి అవి కుదేలవుతాయని, ప్రతి వస్తువు ధర పెరిగిపోతుందని, విదేశీ పెట్టుబడులు దేశం నుంచి వేగంగా తరలిపోతాయని, ఇందువల్ల స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయని చెప్పారు. త్వరలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు జరుగనున్నాయని, అవి పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను ప్రభుత్వం భారీగా పెంచుతుందని రాహుల్ జోస్యం చెప్పారు. కేంద్రంపై నేరుగా విరుచుపడుతూ... ఆర్థిక సవాళ్లను మిగతా 2లో..

## సిద్దిపేటకు రద్దు చేసిన నిధులు ఇవ్వు..



- లేదా ప్రజలకు క్షమాపణ చెప్పు..
- సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు డిమాండ్

## అది గరికపాటి మనసులోని విషం'..

- బడి పిల్లల తిండి వ్యాఖ్యలపై ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఫైర్!

## ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని నరేంద్రమోదీ ఫోన్.. !



న్యూఢిల్లీ, మార్చి 21: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా రంజాన్ , పర్షియన్ నూతన సంవత్స నౌరుజ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పర్వదినాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం తీసుకు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు, ప్రపంచ సరఫరా గొలుసుకు ఆటంకం కలిగించే కీలక మౌలిక సదుపాయాలపై దాడులను ప్రధాని ఖండించారు.నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగాలని, నౌకామార్గాలు తెరచి ఉంచడం, వాటిని సురక్షితంగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇరాన్‌లోని భారతీయుల రక్షణకు ఆ దేశం తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ ప్రశంసించారు. యుద్ధం మొదలైన తర్వాత ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడటం ఇది రెండోసారి అని చెప్పారు. మార్చి 12న ఓసారి ఫోన్‌లో సంభాషించిన ప్రధాని.. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంపై ఆందోళన వ్యక్తంచేశారు. చర్చలు, దౌత్యమార్గాల్లోనే సంక్షోభాలను పరిష్కరించుకోవాలని ఇరాన్ అధ్యక్షుడికి సూచించారు.అనంతరం సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఖతార్, కువైట్, జోర్డాన్, మలేసియా, ఫ్రాన్స్ దేశాల అధినే తలతో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో తాజా పరిస్థితులపై వారితో చర్చించారు.



## కేంద్రం కీలక నిర్ణయం..

- కమర్షియల్ గ్యాస్ సరఫరా 20శాతం పెంపు

హైదరాబాద్, మార్చి 21: కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పలు రాష్ట్రాలకు కేంద్ర పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్ లేఖ రాశారు. రాష్ట్రాలకు అదనంగా మరో 20శాతం కమర్షియల్ గ్యాస్ అందించనున్నట్లు ప్రకటించారు. ఈనెల 23వ తేదీ నుంచి అదనంగా 20 శాతం కమర్షియల్ గ్యాస్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు.ఇటీవల 10శాతం కమర్షియల్ గ్యాస్ సరఫరాను కేంద్రం పెంచిందని నీరజ్ మిట్టల్ స్పష్టం చేశారు. తాజాగా మరోసారి 20 శాతం పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుందని తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్లు, దాబాలకు గ్యాస్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను సూచించారు. పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్, పాడి పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా స్థానిక సంస్థలతో నడిపించే రాయితీ క్యాంటీన్లు, అవుట్‌లెట్లు, కమ్యూనిటీ కిచెన్‌లకు సరఫరా అయ్యేలా చూడాలని ఆయా రాష్ట్రాలకు నీరజ్ మిట్టల్ సూచించారు.

జీవన్ రెడ్డి ఇంటికి మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి..

## బుజ్జగింపులు షురూ..



హైదరాబాద్, మార్చి 21: కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డికి బుజ్జగింపులు మొదలయ్యాయి. పార్టీ వీడకుండా ఉండేందుకు ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ సంప్రదింపులు మొదలుపెట్టారు.పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. అసలు కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేయడంపై జీవన్ రెడ్డి కొంతకాలంగా బహిరంగంగానే అసమ్మతి తెలుపుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన అధిష్ఠానాన్ని కోరారు. కానీ హైకమాండ్ పట్టించుకోకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో సమావేశానికి రావాలని రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు. కానీ ఇవాళ మీనాక్షి నటరాజన్‌తో జరగాల్సిన మీటింగ్‌కు జీవన్ రెడ్డి గైర్హాజరయ్యారు.ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి ఇంటికి ఇవాళ ఉదయం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెళ్లారు. జీవన్ రెడ్డితో అల్పాహారం చేస్తూ ముచ్చటిస్తున్నారు. కాగా, రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఇవాళ కాంగ్రెస్ పార్టీ లేదని జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించకుండా రహస్యంగా చర్చిస్తున్నారు. కాగా, ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేస్తున్నారని సమాచారం.

# తుంగతుర్తి లో ఘనంగా ఈద్ ఉల్. ఫితర్. వేడుకలు



హైదరాబాద్, మార్చి 21: తుంగతుర్తి మండల పరిధిలోని పలు గ్రామాల ముస్లిం సోదరులంతా రంజాన్ సందర్భంగా ఈద్గా వద్ద మండల పరిధిలోని పలు గ్రామాల ముస్లిం సోదరులు రంజాన్ శుభాకాంక్షలు ఒకరికి ఒకరు ఆ లింగనం చేసుకుంటూ కులమతాలకు అతీతంగా అందరూ సమానమే అంటూ మత గురువు మౌలానా ప్రార్థనలు చేస్తూ ఈరోజు ముస్లిం సోదరులు బీదవారికి సహాయం చేస్తూ పుణ్యం చేసుకోవడానికి అనేక పుస్తకాలను చదివి మక్కా ప్రార్ధనలు చేస్తూ అల్లాను జ్ఞాపకం చేస్తూ ఎన్నోసార్లు అల్లా అక్బర్ ఇల్లా అంటూ మన మండలంలోని ముస్లిం సోదరులందరూ ఈ ప్రార్ధనలో పాల్గొని వారు బీదవారికి ఎంతో కొంత డబ్బులు పంచుతూ రంజాన్ శుభాకాంక్షలు తెలియపరుస్తూ పలు రాజకీయ నాయకులతో పాటు కుల పెద్దలకు అలింగణం చేసుకుంటూ ఈద్-ఉల్-ఫితర్ అని వారి అల్లాను జ్ఞాపకం చేస్తూ వారు ప్రార్ధనలు చేసినారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షులు జాన్ సార్. కమిటీ సభ్యులు లాల్ దస్తగిరి.పాషా. పలు గ్రామాల ముస్లిం సోదరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా మహనీయుల విగ్రహ ఆవిష్కరణ

- జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మందుల సామేల్
- కుల నిర్మూలన అన్ని వర్గాల సమానత్వం పై పోరాటం
- పూలే తన జీవితం ద్వారా సమాజానికి ప్రేరణ నివ్వడం అభినందనీయమన్నారు



హైదరాబాద్, మార్చి 21: తుంగతుర్తి మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే నూతన విగ్రహావిష్కరణ ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు మందుల సామెల్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే జీవితం విద్య సమాజసేవ, అంటరానితనం నిర్మూలన మహిలో ద్దారణ కు కృషి చేశారు. విద్యావంతులపై మానవత్వం పెంపొందించేందుకు దిగువ వర్గాలకు సమానత్వం పై కృషిని ప్రత్యేకంగా గుర్తించారు. మహాత్మ జ్యోతిరావు పూలే తన జీవితం ద్వారా సమాజానికి ఎంతో సేవానందించి పేద బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి గా నిలిచారన్నారు. ఆయన బార్డర్లో నడవాలని యువతకు పిలుపునిచ్చారు. విద్యా ప్రబోధన మరియు సమానత్వం కోసం పోరాడటం మనందరికీ ఆదర్శంగా ఉంటుంది అని పేర్కొన్నారు. అంతేకాక అతని కాలంలో విద్యను మెరుగుపరచుకోవడానికి ఎన్నో కష్టనష్టాలతో దేశంలో విద్య అనేది చాలా ముఖ్యం అని నేర్పిన వ్యక్తి సావిత్రిబాయి పూలే చదువులను నేర్పి నిరుపేదలను విద్యావంతులుగా చేసిన వీరనారి ఆమె అడుగుజాడలో మహిళలంతా నడవాలని సమానత్వం కోసం పోరాడడం మనందరికీ ఆదర్శంగా ఉంటుంది అని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ చిలుకల మంజుల వెంకన్న ఉపసర్పంచ్ శ్రీకాంత్, బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, గుడిపాటి సైదులు, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న. రేగటి రవి. మాజీ ఎంపీటీసీ లతా రెడ్డి, రవీందర్ రెడ్డి. మండల సమీదాన్ కోఆర్డినేటర్ అనిల్.పలువురు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



### సూర్యాపేట పట్టణ సిఐ వెంకట్ వెల్లడి

హైదరాబాద్, మార్చి 21: స్టాఫ్ నర్స్ ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి కోట్లాది రూపాయలు వసూలు చేసిన కిలాడీ కేటుగాడు దుగ్యాల రఘురామ్‌ను అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట పట్టణ సీఐ వెంకట్ తెలిపారు.... సీఐ వివరాలిలా హైదరాబాద్‌కు చెందిన వాణితో కలిసి సుమారు 60 మంది బాధితుల నుండి రూ.1.85 కోట్లు కాజేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. మోసం చేసిన సొమ్ముతో జల్సాలు చేస్తూ ప్లాట్లు, కార్లు కొనుగోలు చేసినట్లు గుర్తించామని సీఐ తెలిపారు.

# అది గరికపాటి మనసులోని విషం'..

## బడి పిల్లల తిండి వ్యాఖ్యలపై ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఫైర్!



హైదరాబాద్, మార్చి 21: ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ప్రస్తుతం పెను దుమారాన్ని రేపిన సంగతి తెలిసిందే. ఒక ప్రసంగం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా భోజనం పెట్టడం, పుస్తకాలు, బట్టలు ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టడమే కాకుండా, పాఠశాలకు వచ్చే పిల్లలను శోభనపు పెళ్ళికొడుకులతో పోల్చడం తీవ్ర విమర్శలకు దారితీసింది. విద్యార్థులు చదువు కోసం కాకుండా కేవలం ఉచిత భోజనం కోసమే బడికి వస్తున్నారనే అర్థం వచ్చేలా ఆయన మాట్లాడటంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా.. తాజాగా ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఎక్స్ వేదికగా అత్యంత ఘాటుగా స్పందించారు.'గరికపాటి తన మనసులో ఉన్న కుసంస్కారాన్ని బయటపెట్టారని, ఈ సమాజంలోని ఆధిపత్య వర్గాలకు, మేధావులకు తరతరాలుగా పేదవారి చదువు, వారు తినే తిండిపై ఇలాంటి చులకన భావమే ఉంటుందని ఆయన మండిపడ్డారు. గరికపాటి లాంటి వారు గడ్డి మాటలు మాట్లాడుతుంటే, ఆయన ప్రవచనాలకు చప్పట్లు కొడుతున్న మూర్ఖులను చూస్తుంటే జాలి వేస్తోందని ఆర్.ఎస్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న రాజకీయ వివక్షను కూడా ప్రవీణ్ కుమార్ ఎత్తిచూపారు. మొన్న దళిత ఎమ్మెల్యే మందుల సామేలు ఇంటిపై దాడి చేసిన బండి సంజయ్ మరియు బీజేపీ గ్యాంగ్, ఇప్పుడు బ్రాహ్మణ వర్గానికి చెందిన గరికపాటి ఇంటికి వెళ్తారా? అని ఆయన ప్రశ్నించారు. పోలీసులు కూడా గరికపాటిపై కేసులు పెట్టరని, జాతీయ బాలల హక్కుల సంఘం లేదా మానవ హక్కుల సంఘం ఆయనను కనీసం పిలిచి అడగవని విమర్శించారు. పేద పిల్లలు పోషకాహారం అందక అస్థిపంజరాలుగా మారి, బీజేపీ మరియు కాంగ్రెస్ పార్టీల జెండాలు మోసే రోబోలుగా మిగిలిపోవాలని వారు కోరుకుంటున్నారని దుయ్యబట్టారు. గరికపాటి లాంటి వ్యక్తులపై కేసులు పెట్టి చంచల్‌గూడ 'అండా' సెల్‌లో వేసినప్పుడే తెలుగు రాష్ట్రాల్లో నిజమైన విజ్ఞానం వికసిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పేదరికం, వివక్ష ఈ దేశంలో నేటికీ పోకపోవడానికి గరికపాటి లాంటి వారి ఆలోచనలే కారణమని, అందుకే రోహిత్ వేముల లాంటి వారు బలవుతున్నారని' ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు.

# సిద్దిపేటకు రద్దు చేసిన నిధులు ఇవ్వు..


- లేదా ప్రజలకు క్షమాపణ చెప్పు..
- సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు డిమాండ్



హైదరాబాద్, మార్చి 21: మాదేమో శ్రమ ఫలితం.. మీదేమో శిలా ఫలకమా.., ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం మాది.. ప్రారంభోత్సవానికి కత్తెర మీదా అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాలో ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రావడానికంటే ముందు జిల్లాకు రద్దు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1070 కోట్ల నిధులను విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదని.. మూడు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని.. వాటన్నింటినీ రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు.ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 27 నెలల తర్వాత సిద్దిపేట నియోజకవర్గానికి ఎట్టకేలకు సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా వస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. ఇన్నాళ్లు మా నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని.. తెలంగాణ రాష్ట్రంలోనే ఈ నియోజకవర్గం లేదన్నట్లుగా వ్యవహరించారని విమర్శించారు.. ఇప్పటికీ నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం పేరిట ఇక్కడ అడుగుపెడుతున్నారని.. ఈ సందర్భంగా మా నియోజకవర్గ ప్రజల తరఫున నిన్ను కొన్ని ప్రశ్నలు అడగదలచుకున్నానని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిఫలమే ఈ ఫామాయిల్ ఫ్యాక్టరీ. కాళేశ్వరం ప్రాజెక్టును కూలేశ్వరంగా మాట్లాడిన నీ చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభించడం శోచనీయమని హరీశ్‌రావు అన్నారు. కోనసీమ, గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో కనిపించే ఫామాయిల్ మొక్కలను ఏ నదీ ప్రవాహం లేని సిద్దిపేట జిల్లాలో ఎలా సాగు చేశారో ఇప్పటికైనా మీకు అర్థమైందా..? అని ప్రశ్నించారు. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ మొక్కలు పెరుగుతాయి. మంచి దిగుబడి ఇస్తాయి. కరువు పీడిత సిద్దిపేట జిల్లాలో తేమ శాతం ఎక్కడి నుండి వచ్చిందో నీ వెంట ఉండే ఇంజనీర్లను అడుగు ముఖ్యమంత్రి గారు అని ఎద్దేవా చేశారు.2018 లో భారతీయ ఆయిల్ పామ్ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తల బృందం సిద్దిపేట జిల్లాలో తిరిగి నీటి వసతి, గాలిలో తేమ లేదని సిద్దిపేట జిల్లా ఆయిల్ పామ్ సాగుకు అనుకూలం కాదన్నారు. కానీ 2021 లో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నిర్మితమైన అనంతగిరి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ద్వారా నీటి వసతి, గాలిలో తేమశాతం పెరగడం వలన సిద్దిపేట జిల్లా ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తల బృందం ప్రకటించిందని గుర్తుచేశారు. ఫామాయిల్ ఫ్యాక్టరీకి బీఆర్ఎస్ ప్రభుత్వమే రూ.300 కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. నర్మెట్ట గ్రామ రైతుల సహకారంతో టీజీఐఐసీ ద్వారా 62 ఎకరాల భూమిని ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సేకరించామని పేర్కొన్నారు. 2022 ఏప్రిల్ 4 వ తేదీన ఫ్యాక్టరీకి భూమిపూజ చేసి వెంటనే సివిల్ పనులకు టెండర్లు పిలవడం జరిగింది. పామ్ ఆయిల్ నూనె గింజల దిగుబడి వచ్చేలోగా ఫ్యాక్టరీ అందుబాటులోకి రావాలని మొదటి దశ పనులను శరవేగంగా ప్రారంభించామని తెలిపారు.తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (ఓశ్రీఎ) వ్యవస్థతో మలేషియా టెక్నాలజీ తో ఈ ఆయిల్ పంప్ ఫ్యాక్టరీని నిర్మించాలని ఆనాడే నిర్ణయం తీసుకోవడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. ముందుగా క్రూడ్ ఆయిల్ ఉత్పత్తిని ప్రారంభించాక ఆ వెంటనే రిఫైనరీ ఆయిల్ ఉత్పత్తి జరిగేలా ప్లాంటును కూడా ప్రారంభించాలని ఆనాడే నిర్ణయించామని పేర్కొన్నారు. ఫ్యాక్టరీకి నీటి కొరత లేకుండా రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుండి ఎల్ డి 9 కాలువ ద్వారా 20 కోట్ల లీటర్ల నీటిని నిలువ చేసేలా స్టోరేజీ వాటర్ రిజర్వాయర్ కూడా సిద్ధం చేయడానికి 2023 జూలై నెలలో ఫౌండేషన్ వేశామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే విడుదలైన నిధులతో ఆనాడే ప్రారంభమైన పనుల కారణంగా ఇప్పుడు పూర్తయిన ఫ్యాక్టరీని మీరు ప్రారంభిస్తున్నారనే విషయాన్ని గమనించాలని సూచించారు.ఫామాయిల్ రైతుల కళ్లలో సంతోషాన్ని చూస్తున్నామని తెలిపారు.. ఫామాయిల్ సాగుపై రైతుల్లో చైతన్యం కల్పించడం, వారిని బస్సుల్లో తీసుకెళ్లి అశ్వరావుపేట, అప్పారావుపేట లో ఫామాయిల్ పంటలను, ఫ్యాక్టరీలను సందర్శింపజేసి రైతుల్లో చైతన్యం తెచ్చామని నాటి పరిస్థితులను గుర్తుచేశారు. మొక్కలు నిరంతరంఈ అందుబాటులో ఉండేలా నర్సరీలు ఏర్పాటు చేయడం, ప్రత్యేక సబ్సిడీలతో రైతులను ప్రోత్సహించామని తెలిపారు. చివరకు దిగుబడి ప్రారంభమయ్యాక నూనెగింజల కొనుగోళ్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఇక్కడే అత్యాధునిక ఫామాయిల్ ఫ్యాక్టరీని నెలకొల్పడం అన్నీ కూడా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేము చేసిన కృషి ఫలితమే అని స్పష్టం చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటు, ఫామాయిల్ తోటల సాగులో మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమేనని గుర్తుచేశారు. మీ ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ను అడగండి.. అనాడు నేను, మా రైతులు పడిన కష్టం గురించి చెబుతారని అన్నారు. 2021 జూన్ 5వ తేదీన తొలి పామాయిల్ మొక్కను నేను నాటిన విషయం ఈ జీవితాంతం గుర్తు పెట్టుకుంటానని హరీశ్‌రావు తెలిపారు. ఎందుకంటే అసలే కొత్త పంట.. దిగుబడి వస్తుందో రాదో తెలియని పరిస్థితి.. రైతుల ఆదాయం పెంచాలనే నా ఆలోచన కేసీఆర్ ఆశీస్సులతో ఇక్కడిదాకా వచ్చిందని పేర్కొన్నారు. నా ఒక్కడి మాటపై నమ్మకంతో నేడు 15 వేల ఎకరాలకు పైగా పామాయిల్ సాగు చేయడం.. పంటలు కోతకు వచ్చి మంచి దిగుబడి రావడం నాకు జీవితాంతం తృప్తిని మిగులుస్తుందన్నారు. ఏది ఏమైనా.. పామాయిల్ రైతులకు ఆర్థిక భద్రతను, మనో ధైర్యాన్ని కల్పించడానికి కేసీఆర్ గారి ఆశీస్సులతో ఇక్కడ నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్నందున.. ఇందులో నా పాత్ర కీలకంగా ఉన్నందుకు గర్వపడుతున్నానని అన్నారు.-- 2022 జనవరి 12వ తేదీన 62 ఎకరాల భూమి కేటాయించి, మార్చి 4న భూమికి ఫెన్సింగ్ వర్క్ పనులు మరియు స్టోరేజ్ వాటర్ రిజర్వాయర్ ను ప్రారంభించామని హరీశ్‌రావు తెలిపారు 2023 ఏప్రిల్ 4న ఫ్యాక్టరీ కి పునాదిరాయి వేసి త్వరితగతిన పనులు ప్రారంభించామని చెప్పారు. మాదేమో శ్రమ ఫలితం.. మీదేమో శిలా ఫలకమా అని ప్రశ్నించారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వానిది కొండంత పాత్ర అయితే.. కాంగ్రెస్ ప్రభుత్వానిది గోరంత ప్రమేయం మాత్రమేనని చెప్పారు.నువ్వు ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా.. అధికారంలోకి వచ్చినా మా సిద్దిపేట నియోజకవర్గంపై మీ కక్ష చల్లారదని అర్థమైందని హరీశ్‌రావు అన్నారు. నువ్వు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించిన రూ. 1070 కోట్ల నిధులను అర్ధాంతరంగా రద్దు చేశావని మండిపడ్డారు. నిధులు రద్దు చేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిన విషయాన్ని మా నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రేపు అధికారికంగా వస్తున్నందున ఈ నిధులన్నీ తిరిగి తెస్తావనని ఆశిస్తున్నామని అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 22,819 మంది రైతులకు రుణమాఫీ కాలేదు.. మా రైతులకు సంబంధించిన దాదాపు రూ.300 కోట్ల రూపాయల రుణమాఫీ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలోని రైతులకు నువ్వు మూడుసార్లు ఎగ్గొట్టిన దాదాపు రూ.170 కోట్ల రైతు భరోసా డబ్బులు రేపు ఇచ్చి వెళ్తావని ఆశపడుతున్నారని అన్నారు. గత మూడు సీజన్లుగా వడగళ్ల వర్షాలతో నష్టపోయిన రైతులకు రావాల్సిన పరిహారం మంజూరు చేయాలని కోరారు. నీకు సిద్దిపేట పై కక్షాపూరిత ఆలోచన లేకుంటే.. సిద్దిపేట ప్రజలపై ఈర్ష ద్వేషాలు ఉండకుంటే.. నీవు రద్దు చేసిన నిధులన్నీ వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదు.. ఖాళీ చేతులతోనే వస్తున్న.. కత్తెరతో రిబ్బన్ కట్ చేసి వెళ్తా. అని అనుకుంటే మా ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

## వైద్యరంగంలో కేసీఆర్ మార్క్..

### సూపర్ స్పెషాలిటీ వైద్యానికి పెద్దపీట



హైదరాబాద్, మార్చి 21 : 'పేదలు, మధ్యతరగతి ప్రజలు వైద్యాని కి చేసే ఖర్చును తగ్గించాలి. సర్కారే సదుపాయాలను పెంచాలి. తద్వారా వారిని ఆర్థిక అగాధంలోకి జారుకోకుండా చూడాలి' అన్న తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ తన పాలనాకాలంలో సంకల్పం పెట్టుకున్నారు. ఆ మహత్తర ఆశయంతో వైద్యరంగంలో నాడు కేసీఆర్ తెచ్చిన అనేక సంస్కరణలు సత్ఫలితాలు ఇచ్చినట్టు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే-2026 స్పష్టంచేసింది. పదేండ్ల కేసీఆర్ పాలనలో వైద్యారోగ్యశాఖలో ప్రవేశపెట్టిన ప్రతిష్ఠాత్మక పథకాలు, వాటి సత్ఫలితాలు, సూపర్ స్పెషాలిటీ వైద్యానికి కేసీఆర్ చూపిన చొరవను ఈ సర్వే రుజువు చేసింది. కే సీఆర్ పాలనా ప్రగతిపై ప్రభుత్వం విడుదల చే సిన ఆ సర్వే అంకెలు సహా సవివరంగా వెల్లడించింది. పదేండ్లలో అభివృద్ధే జరుగలేదని కాంగ్రె స్ నాయకులు చేస్తున్న ప్రచారం అబద్ధమేనని ఈ సర్వే నిగ్గు తేల్చింది.

# మహమూద్ అలీ ఇంట్లో రంజాన్ వేడుకలు..



- హాజరైన కేటీఆర్

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ నివాసంలో రంజాన్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహమూద్ అలీకి కేటీఆర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలావుంటే రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.


## రంజాన్ సందర్భంగా కేసీఆర్‌ను కలిసిన చిన్ననాటి స్నేహితుడు





హైదరాబాద్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను చిన్ననాటి స్నేహితుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహమ్మద్ జహంగీర్ ఎర్రవెల్లి నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జుబేర్ మహమ్మద్, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.ఈ సందర్భంగా కేసీఆర్ వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా పలు మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు భారీ సంఖ్యలో ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## హోర్ముజ్‌ను తెరవండి.. ఇరాన్‌కు పలు దేశాల విజ్ఞప్తి..



హైదరాబాద్ : హోర్ముజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి చేశాయి. అలాగే పొరుగు దేశాలపై దాడులను కూడా ఆపాలని కోరాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై దాడులను ఖండించాయి. ఇరాన్ దాడులతో అన్ని దేశాల ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతోందని, గల్ఫ్ దేశాలపై దాడులను ఆపాలని కోరాయి ఇరాన్‌కు సూచనలు చేస్తూ యూఏఈ, ఫ్రాన్స్, యూకే, ఇటలీ, జర్మనీ, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, జపాన్, న్యూజిలాండ్, డెన్మార్క్, కెనడా, బహ్రెయిన్ తదితర దేశాలు సంయుక్త ప్రకటన చేశాయి. గల్ఫ్‌లోని నిరాయుధ నౌకలు, చమురు, గ్యాస్ కేంద్రాలు సహా మౌలిక సదుపాయాలపై ఇరాన్ జరిపిన దాడులను ఖండిస్తున్నట్టు ప్రకటించాయి. ఇరాన్ చర్యలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై, అత్యంత బలహీనవర్గాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని పేర్కొన్నాయి . 'చమురు సరఫరాలో అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేయడాన్ని ఖండిస్తున్నాం. సముద్ర చట్టాలకు సంబంధించి ఐరాస ఒప్పందంతో పాటు స్వేచ్ఛాయుత నౌకాయానం అనేది అంతర్జాతీయ చట్టంలో ఓ ప్రాథమిక సూత్రం. ఇరాన్ చర్యలతో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు' అని యూఏఈ విదేశాంగ శాఖ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఇందులో 22 దేశాలు సంతకాలు చేశాయి.

## ద్రవ్యోల్బణం పెరగొచ్చు

సమర్ధవంతంగా ఎదుర్కొనే స్పష్టమైన ప్రణాళిక ఏదీ కేంద్రం వద్ద లేదని అన్నారు. 'మోదీ ప్రభుత్వానికి దిశానిర్దేశం కానీ వ్యూహం కానీ లేవు. వారి వద్ద ఒట్టి మాటలే ఉన్నాయి. ప్రభుత్వం ఏమి చెబుతుందనేది కాదు..సామాన్యుడి పళ్లెంలో ఏమి మిగిలిందనేదే అసలు ప్రశ్న' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాల తగ్గుదల..

తెలిపారు.ఐటీ సెక్టార్‌లో గణనీయంగా ఉద్యోగాల తగ్గుదలపై వారం వ్యవధిలోనే ప్రభుత్వం రెండు సార్లు అంగీకరించడం ఆశ్చర్యకరమని కేటీఆర్ అన్నారు. ఐటీ రంగంలో ఈ ఉద్యోగాల తగ్గుదలకు కృత్రిమ మేధస్సు (ూ×) కారణమా? లేదా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యమా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మహిళ మెడలోని బంగారు పుస్తెలు లాక్కెళ్లిన ఇద్దరు నిందితులు అరెస్ట్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలో మహిళ మెడలో ఉన్న బంగారు పుస్తెలు లాక్కెళ్లిన ఘటనలో పోలీసులు వేగంగా స్పందించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, మార్చి 17, 2026 రాత్రి సాయినగర్ ప్రాంతంలో మేర్గు లత తన ఇంటి గేటు బయటకు వచ్చిన సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అడ్రస్ అడుగుతున్నట్లు నటించి ఆమె మెడలోని బంగారు పుస్తెలను బలవంతంగా తెంపుకొని ద్విచక్ర వాహనంపై పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ముస్లింలకు కేసీఆర్ రంజాన్ శుభాకాంక్షలు..



**బలగం టీవీ, హైదరాబాద్:** రంజాన్ మాసం ఆఖరి పర్వ దినమైన 'ఈద్ ఉల్ ఫితర్' సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత శ్రీ కేసీఆర్ గారు, ముస్లిం సహోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రారంభం నుంచి చివరి రోజు వరకు, ప్రతి రోజూ ప్రత్యేక దైవ ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, భక్తి శ్రద్ధలతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాసాన్ని ఆచరిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పరస్పర శాంతి, సహనం, సౌభ్రాతృత్వం, ప్రేమాభిమానాలు పరిమళిస్తాయని కేసీఆర్ పేర్కొన్నారు. లౌకికవాద విలువలకు ప్రాధాన్యతనిస్తూ, విభిన్న మతాల సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ, గంగా-జమున తహజీబ్‌కు ప్రతీకగా బీఆర్ఎస్ పాలన కొనసాగిందని తెలిపారు.

## మాజీ కౌన్సిలర్ నీలిశంకర్ హఠన్మరణం..



**రాజన్న సిరిసిల్ల, బలగం టీవీ:** రాజన్న సిరిసిల్ల జిల్లా మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ నీలి శంకర్ ఐదు రోజుల క్రితం హఠన్మరణం చెందగా వారి కుమారులైన నీలి శ్రీనివాస్, శ్రీధర్‌లను బీఆర్ఎస్ నాయకులు శనివారం పరామర్శించారు. టీడీపీ లో సినియర్ నాయకుడైన నీలి శంకర్ 2000 సంవత్సరం నుంచి 2005 వరకు మున్సిపల్ కౌన్సిలర్ గా ప్రజలకు సేవలందించారు. మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు పని చేశారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో నీలి శంకర్ బీఆర్ఎస్ పార్టీలో చేశారు. తెలంగాణ ఉద్యమంలో కూడా నీలి శంకర్ పని చేశారు. నీలి శంకర్ కుమారులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. నీలి శ్రీనివాస్, శ్రీధర్ ఉపాధ్యాయ సంఘాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా లో కీలక నేతలుగా.. క్రియశీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ లో పరామర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగ రావు, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణధ్యక్షులు జిందం చక్రపాణి, కాంగ్రెస్ నేత గడ్డం నర్సయ్య, పలువురు ఉపాధ్యాయ సంఘా నాయకులు, బలగం టీవీ సీఈవో బాలు కాయితి పరామర్శించారు. నీలి శంకర్ గారి మరణం పట్ల విచారం వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.
దేవయ్య, అక్కేమ్ ఎల్లయ్య, చంద్రమౌళి,మహిళా సభ్యులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం..



### కంచర్ల రవి గౌడ్ ఫైర్

**బలగం టీవీ, సిరిసిల్ల:** రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని కంచర్ల రవి గౌడ్ తీవ్రంగా విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026-27 బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటిపై దృష్టి సారించకపోవడం దురదృష్టకరమని అన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వెంటనే విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కంచర్ల రవి గౌడ్ హెచ్చరించారు.

# బాల కార్మికత్వం, భిక్షాటన నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:** బాల కార్మికత్వం, భిక్షాటన నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన అన్నారు. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, కలెక్టర్ శ్రీమతి గరిమ అగ్రవాల్ మార్గదర్శకత్వంలో, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని గంగిరెద్దుల కాలనీని దత్తత తీసుకుని, కాలనీలోని పిల్లలకు మెరుగైన విద్య, ఆరోగ్యం మరియు రక్షణ సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. కాలనీవాసులతో సమావేశమై పిల్లల విద్యా స్థితిగతులు మరియు ఆధార్ నమోదు పై సమీక్ష నిర్వహించారు. ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా మర్రిపల్లి చందన మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, బాల కార్మికత్వం మరియు భిక్షాటన నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి, ప్రతి పిల్లవాడు తప్పనిసరిగా పాఠశాలకు హాజరు కావాలని సూచించారు.



అదనంగా, కాలనీలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీని బలోపేతం చేసి, పిల్లల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం రుద్రంగి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను సందర్శించి, అందిస్తున్న సేవలు, పౌష్టికాహారం మరియు శిశు సంరక్షణపై సమీక్ష నిర్వహించారు. రుద్రంగి మండలంలోని మానలా ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించి, మౌలిక వసతులు మరియు తాగునీటి సరఫరా పై ఆరా తీశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తదుపరి కేజీబీవీ స్కూల్, రుద్రంగిని సందర్శించి, విద్యార్థుల భోజన సదుపాయాలు మరియు ఇతర సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సనుగుల గ్రామ సర్పంచ్ బి. లావణ్య, ఉపసర్పంచ్ ఎస్. స్వామి, జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం, చందుర్తి మండల ఎంపీడీవో శ్రీమతి రాధా, జిల్లా బాలల పరిరక్షణ అధికారి కవిత, హైస్కూల్ హెడ్ మాస్టర్ సత్యనారాయణ, ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ కె. ముఖేష్, కేజీబీవీ ఎస్.వో, రుద్రంగి, అంగన్వాడీ టీచర్లు, ఇతర శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సంప్రదాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ










**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:** సరోజినీదేవి, 20-03-2026: స్థానికంగా ఉన్న శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సంప్రదాయ దినోత్సవం వేడుకలు ఎంతో ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు భారతీయ సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబించారు. విద్యార్థులు వివిధ ప్రాంతాల సంప్రదాయ వేషధారణలో పాల్గొని అందరిని ఆకట్టుకున్నారు. పాటలు, నృత్యాలు మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె రాజు రెడ్డి మాట్లాడుతూ.. మన సంస్కృతి మరియు సంప్రదాయాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇటువంటి కార్యక్రమాలు




విద్యార్థుల్లో భారతీయ విలువలపై అవగాహన పెంచుతాయని తెలిపారు. ఉపాధ్యాయురాలు పల్లె ఉమ , నవీన్, బాబు గారు కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించి విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు కూడా పాల్గొని విద్యార్థులను అభినందించారు. సంప్రదాయ దినోత్సవం కార్యక్రమం సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది.



# రంజాన్ పండుగ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక

- మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ:** రంజాన్ పండుగ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకఅని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలో రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని, ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేసి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రంజాన్ మాసం త్యాగం, సహనం, దయ, సమానత్వానికి సంకేతమని,నెలరోజుల పాటు ముస్లిం



సోదరులు పాటించిన ఉపవాస దీక్షలు వారి ఆత్మశుద్ధికి దోహదపడతాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ, మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. వేములవాడ పట్టణంలో ముస్లిం సోదరులు దాదాపు 10 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న షాదీ ఖానా నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేశామని, త్వరలోనే ఆ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 1 కోటి 15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. చివరగా అల్లాహ్ ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసి రైతులు, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలందరికీ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కరీంనగర్‌లో విషాదం

### భార్య మరణించిన ఐదు రోజులకే ఎస్ఐ చంద్రశేఖర్ ఆలిత్మలిహలిత్య..

**బలగం టీవీ, కరీంనగ:** కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. భార్య దివ్య మరణించిన ఐదు రోజులకే ఆయన కూడా బలవన్మరణానికి పాల్పడటం ఇరు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. తల్లిదండ్రుల మరణాలతో అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు. గత ఐదు రోజుల క్రితం చంద్రశేఖర్ భార్య దివ్య, గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకున్నారు. అయితే, ప్రాథమికంగా ఆమె కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మృతదేహాన్ని స్వగ్రామమైన ఇల్లందకుంట మండలం సీతంపేటకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. దివ్య మరణానికి భర్త చంద్రశేఖరే కారణమని ఆరోపిస్తూ అంత్యక్రియల సమయంలో మృతురాలి బంధువులు ఆయనపై దాడికి ప్రయత్నించారు. గ్రామస్తులు మరియు బంధువుల తీవ్ర నిరసనల మధ్య దివ్య తల్లిదండ్రులు అంత్యక్రియలు పూర్తి చేశారు. నేడు భార్య ఐదో రోజు కార్యానికి



(దినవారాలు) హాజరయ్యేందుకు చంద్రశేఖర్ తన అత్తగారి ఊరైన సీతంపేటకు వెళ్లారు. అక్కడ గదిలోకి వెళ్లిన ఆయన ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తలుపులు తీసి చూడగా, ఆయన ఉరి వేసుకొని కనిపించారు. వెంటనే

# ఘనంగా సారంపల్లిలో రంజాన్ వేడుకలు





## బీఆర్ఎస్ నేతల శుభాకాంక్షలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
సారంపల్లి గ్రామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ జిల్లా నాయకుడు షేక్ అబుబకర్ నివాసంలో శనివారం రోజున ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తోట ఆగన్న హాజరై షేక్ అబుబకర్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తోట ఆగన్న మాట్లాడుతూ.. రంజాన్ పర్వదినం సౌభ్రాతృత్వం, సామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, ఐక్యత పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కోడి అంతయ్య, వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, జిల్లా నాయకులు పడగల రాజు, రామ గౌడ్, అమరరావు, భూమేష్ గౌడ్, శ్రీకాంత్ రావు, జీవన్, రాజేశ్వరరావు, సురేష్, షంషూర్, ఖాదర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగన్న.





**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
తోట ఆగన్న రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మజీద్‌ల వద్ద రంజాన్ వేడుకలు జరుపుకుంటున్న ముస్లింలను ఆయన స్వయంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తోట ఆగన్న మాట్లాడుతూ.. అల్లా కృపతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సౌహార్దత మరింత పెరగాలని కోరుతూ ముస్లింలతో ఆప్యాయంగా మాట్లాడారు.

# రాధాకృష్ణ భజన బృందం చిన్నారులకు రాఘవేంద్ర హాస్పిటల్ చిరు కానుక..



**బలగం టీవీ, ఇల్లంతకుంట:** ఇల్లంతకుంట మండలంలోని కంది కట్కూర్ గ్రామంలో ఉగాది సందర్భంగా అనంతారం రాధాకృష్ణ భజన బృందం కళాకారులు చక్కటి భజన కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భజన బృందం చిన్నారుల ఆటపాటలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. చక్కటి ప్రదర్శన కనబర్చిన చిన్నారులకు చిరు కానుక గా రాఘవేంద్ర హాస్పిటల్ వారు బహుమతులను అందజేసినట్లు భజన బృందం నిర్వహకులు గరిగే లక్ష్మన్, వికృతి రవీందర్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి భక్తులు వొల్లాల వెంకటేష్, సిరిపురం స్వామి, బొల్లం పరశురామ్, అనిల్, భక్త బృందం సభ్యులు కుమ్మరివేణి సత్యనారాయణ, దారవేణి

# రేవంత్ రెడ్డికి చిన్నప్పటినుండి సరైన గురువు లేడేమో అందుకే ఇలా చేస్తున్నాడు

## మా దగ్గరికి రండి మా పిల్లలు చదువు చెప్తారు : మూసీ బాధితులు

**బలగం టీవీ, హైదరాబాద్**
మీ తల్లిని తీసుకెళ్లి ఇంకొక తల్లిని ఇస్తామంటే ఊరుకుంటారా? అదే విధంగా మా ఇల్లు కూడా మాకు తల్లితో సమానమే.. దయచేసి మా జీవితాలతో ఆడుకోకండి అని మూసీ బాధితురాలు హెచ్చరించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి కట్టుకున్న ఇల్లు ఒకరు వచ్చి హైదరాబాద్ సింగపూర్ చేస్తా అంటారు, ఇంకొకరు మీ ఇల్లు కూలగొట్టి సుందరీకరణ చేస్తా అంటారు, చిన్న పిల్లల ఆటల్లాగా ఉందా? అని వాపోయారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ఎకానమీ పెంచుతా అనడం పెద్ద జోక్ లాగా ఉందని, ఆయనకు ఎప్పుడూ ఆయన ఎకానమీ పెంచుకోవడం మీదనే ధ్యాస ఉంటుందని మూసీ బాధితులు ఆరోపించారు.

# చింతలపూడి సర్కిల్‌లో గోల్డ్ దొంగతనాల మిస్టరీ ఛేదన..



**బలగం టీవీ, ఏలూరు:**
ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఎ ఎస్ పి ఆర్ సుస్మిత ద్వారా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చింతలపూడి సర్కిల్ పరిధిలో ఫిబ్రవరి 27 మరియు మార్చి 3 తేదీలలో జరిగిన రెండు గోల్డ్ దొంగతనాల కేసులను పోలీసులు విజయవంతంగా ఛేదించినట్లు తెలిపారు. గణిజర్ల గ్రామంలో బుల్లా భూలక్ష్మి ఇంట్లో మధ్యాహ్న సమయంలో ఎవరూ లేని వేళ దొంగలు మెయిన్ డోర్ లాక్ మరియు బీరువా తాళాలు పగులగొట్టి బంగారం అపహరించిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ద్వారా ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేయగా, అనుమానితుడిని అదుపులోకి తీసుకుని అతని ఫింగర్ ప్రింట్లను పరిశీలించారు. దర్యాప్తులో భాగంగా, సంఘటన స్థలాల్లో సేకరించిన ఫింగర్ ప్రింట్లతో పాటు 2024లో పాతిమపురంలో జరిగిన గోల్డ్ దొంగతనం కేసులోని ఫింగర్ ప్రింట్లతో సరిపోలడంతో ముగ్గురు ముద్దాయిలు --- దుక్కిపాటి కిషోర్, కొట్టే రమేష్, మూర్ల చార్లెస్‌ను అరెస్ట్ చేశారు. గణిజర్ల మరియు పాతిమపురం ప్రాంతాల్లో దొంగిలించిన బంగారం స్వాధీనం చేసుకుని, ముద్దాయిలను రిమాండ్‌కు పంపించి కోర్టుకు తరలించారు. వీరు చింతలపూడి పరిసర ప్రాంతాలకు చెందినవారని తెలిపారు. అదేవిధంగా ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మరో గోల్డ్ దొంగతనం కేసులో క్లూస్ టీం సహాయంతో బోడ ప్రతీప్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 38 గ్రాముల బంగారం మరియు ఒక డ్యూక్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులోనూ ముద్దాయిని రిమాండ్ చేసి కోర్టుకు తరలించారు. ఇంటి తాళం వేసి పనులకు వెళ్లే వారి ఇళ్లను టార్గెట్ చేస్తూ ఈ దొంగతనాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎ ఎస్ పి సూచించారు. ఈ కేసులను ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన సీఐ క్రాంతికుమార్, ఎస్ఐలు సతీష్ కుమార్, వెంకన్న, అలాగే పోలీస్ సిబ్బంది సీతా దేవయ్య, వెంకటేశ్వరావు, సత్యనారాయణలను జిల్లా పోలీస్ కేంద్రం తరఫున ప్రశంస పత్రాలతో సత్కరించనున్నట్లు తెలిపారు.

# భీమేశ్వర స్వామిని దర్శించిన ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి





- **వేములవాడలో ప్రత్యేక పూజలు...**

**భక్తుల భద్రతపై అధికారులకు కీలక ఆదేశాలు**

**బలగం టీవీ, వేములవాడ:** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని మల్టీ జోన్--1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఐజీపీకి అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి శేషవస్త్రం కప్పి లడ్డూ ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి పోలీసు అధికారులతో మాట్లాడుతూ, దక్షిణకాశిగా పేరుగాంచిన వేములవాడకు దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తుల రాకపోకలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆలయ పరిసర ప్రాంతాల్లో గస్తీ పెంచాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ ను కలిసి రాజన్న ఆలయ అభివృద్ధి, అలాగే జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై భీమేశ్వర సదనంలోని వసతి గృహంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆలయ ఈవో ఎల్. రమాదేవి, వేములవాడ మరియు సిరిసిల్ల డీఎస్పీలు శ్రీనివాస్, నాగేంద్రచారి, ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.

# మరో వివాదంలో జనగామ సైకో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

- **నిరుద్యోగుల బ్రతుకులతో చెలగాటం ఆడుతున్న జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ, జనగామ:**
జనగామ జిల్లాలో కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకాల ప్రక్రియపై వివాదం నెలకొంది. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆధ్వర్యంలో గత వారం విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం 14 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు, 1 మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టుకు దాదాపు 300 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులలో నుండి 101 మంది అభ్యర్థులను అధికారులు షార్ట్‌లిస్ట్ చేసినట్లు సమాచారం. అయితే, నిన్న రాత్రి ఆలస్యంగా (సుమారు 11 గంటలకు) షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు ఫోన్ కాల్స్, మెసేజ్‌లు పంపించి, మరునటి రోజు ఉదయం 11 గంటలలోపు కలెక్టర్ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలియజేశారు. కానీ కార్యాలయానికి వచ్చిన అభ్యర్థులకు ముందస్తు సమాచారం లేకుండా అకస్మాత్తుగా రాత పరీక్ష నిర్వహించారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. షార్ట్‌లిస్ట్ చేసిన 101 మందిలో కేవలం 89 మందికే పరీక్ష రాయడానికి అనుమతి ఇచ్చి, మిగిలిన 11 మందిని అనుమతించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

# జిల్లా పోలీస్ అధికారులతో మల్టీ జోన్ I ఐజీపీ శ్రీచంద్రశేఖర్‌రెడ్డి సమీక్ష



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
జిల్లాకు విచ్చేసిన మల్టీ జోన్-I ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డికి జిల్లా పోలీస్ అధికారులు పూల మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాలచే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, సర్కిల్ వారీగా శాంతి భద్రతల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు భద్రతాభావం కలిగేలా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ అధికా రులు, సిబ్బంది చట్టాలపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని, నమోదు అయిన కేసులలో దర్యాప్తు నాణ్యతను మెరుగుపరుస్తూ ప్రజలకు వేగవంతమైన న్యాయం అందేలా పోలీస్ యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్లలో 5ఎస్ లో బాగంగా రికార్డుల నిర్వహణను సక్రమంగా ఉంచాలని, జిల్లాలో



ప్రోయాక్టివ్, విజిబుల్, కమ్యూనిటీ పోలీసింగ్ పై దృష్టి సారించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై నిఘాను కఠినతరం చేయాలని ఆదేశించారు. ఇంటి నుండి బయటకు వెళ్లిన ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరే లక్ష్యంతో చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" లో భాగంగా అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, వెంకటేశ్వర్లు, రవి, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, సురేష్ పాల్గొన్నారు.








# తీపి కబురుతో వచ్చే చేదు "ఉచ్చు"



# లోన్ యాప్స్ మాయాజాలం...!

హైదరాబాద్, మార్చి 22:

"అరచేతిలోని స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు అప్పుల కుంపటిగా మారుతోంది, చేతిలో చిల్లిగవ్వ లేని సమయంలో 'క్షణాల్లో లోన్' అంటూ వచ్చే నోటిఫికేషన్లు సామాన్యులకు ఆశల దీపాల్లా కనిపిస్తాయి, కానీ ఆకర్షణీయమైన ప్రకటనలతో ఆశ చూపే ఈ లోన్ యాప్స్ వెనుక ఒక భయంకరమైన సైబర్ మాఫియా దాగి ఉంది, కేవలం ఒక బటన్ నొక్కితే చాలు అటు పైసా పడుతుంది, ఇటు మీ వ్యక్తిగత సమా చారం, ఫోటోలు, కాంటాక్ట్ లిస్టు అంతా కిరాతకుల చేతు ల్లోకి వెళు ంది, అవసరం తీరడం పక్కన పెడితే, పరువు తీ సే బ్లాక్ మెయిలింగ్ మొదలయ్యే వరకు ఇది ఎంతటి ప్ర మాదకరమైన ఉచ్చో చాలామందికి అర్థం కావడం లేదు, ఆర్థిక కష్టాల కంటే ఈ 'డిజిటల్ మాయాజాలం' కలిగించే మానసిక క్షోభ ఎంతో భయంకరమైనది" ప్రస్తుత కాలంలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు, ఐదు నిమిషాల్లో లోన్ వచ్చేస్తుం ది, కానీ, ఆ "ఐదు నిమిషాల" వెనుక జీవితాంతం వెంటాడే ఒక పెద్ద ఉచ్చు దాగి ఉంది, లోన్ యాప్స్ మోసాల గురిం చి ప్రజలను అప్రమత్తం చేసే ఒక ప్రత్యేక కథనం " విజన్ ఎక్స్ ప్రెస్" లో... రవి ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, నెల చివర్లో చి న్న ఆర్థిక ఇబ్బంది రావడంతో సోషల్ మీడియాలో కనిపిం చిన ఒక "ఇన్స్టంట్ లోన్ యాప్" ప్రకటనను క్లిక్ చేశాడు, "డాక్యుమెంట్లు అక్కర్లేదు.. క్రెడిట్ స్కోర్ అవసరం లేదు.. 5 నిమిషాల్లో రూ. 10,000 మీ ఖాతాలోకి" ఇదీ ఆ యాప్ వాగ్దానం.. రవి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నాడు, ఇన్‌స్టా ల్ చేసేటప్పుడు తన ఫోన్ కాంటాక్ట్స్, గ్యాలరీ, లోకేషన్ ప ర్మిషన్లు అడిగితే ఏమీ ఆలోచించకుండా 'ఆశ్రీశ్రీశీష' కొట్టేశా డు, కేవలం రూ. 7,000 మాత్రమే అతని ఖాతాలో పడ్డా యి (మిగతావి ప్రాసెసింగ్ ఫీజులట..!). వారం రోజులు తి రగకముందే నరకం మొదలైంది,

## అసలు మోసం ఎలా జరుగుతుంది...?




అధిక వడ్డీ రేట్లు.. 7 రోజులకు 30% నుండి 40% వరకు వ డ్డీ వసూలు చేస్తారు, డేటా దొంగతనం జరిగింది, మీరు ప ర్మిషన్ ఇచ్చినప్పుడు మీ ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లు, వ్య క్తిగత ఫోటోలు వారి సర్వర్‌లోకి వెళ్ళిపోతాయి, ఇక బ్లాక్ మెయిల్ మొదలు పెట్టారు, లోన్ కట్టడం ఒక్క రోజు ఆల స్యమైనా, మీ ఫోటోలను మార్ఫింగ్ (Morphing) చేసి, మీ కాంటాక్ట్ లిస్టులో ఉన్నవారందరికీ పంపిస్తామని బెదిరిస్తా రు,

## మీరు తీసుకోవాల్సిన జాగ్రత్తలు


ఈ మోసాల బారిన పడకుండా ఉండాలంటే ఈ క్రింది విష యాలను గుర్తుంచుకోండి.. =దీ× గుర్తింపు ఉందా.? ఏదైనా లోన్ యాప్ వాడే ముందు, అది ఆర్‌బీఐ (=దీ×) రిజిస్టర్డ్ బ్యాంక్ లేదా చీదీఖీజతో అనుబంధం కలిగి ఉందో లేదో త నిఖీ చేయాలి, పర్మిషన్ల విషయంలో జాగ్రత్త పడాలి, లోన్ యాప్‌కి మీ గ్యాలరీ లేదా కాంటాక్ట్స్ యాక్సెస్ ఎందుకు? అలాంటి పర్మిషన్లు అడిగే యాప్స్‌కు దూరంగా ఉండాలి, యాప్ డౌన్‌లోడ్ చేసే ముందు రేటింగ్స్ మాత్రమే కాదు, నె గటివ్ రివ్యూలను కూడా చదవాలి, అంతేకాకుండా, వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే తెలియని లోన్ లింక్స్‌ను ఎప్పుడూ క్లిక్ చేయకండి, ఒకవేళ మీరు ఇప్పటి కే చిక్కుకుంటే ఏం చేయాలి..? భయం వద్దు, ధైర్యంగా ఉం డండి, మీరు భయపడే కొద్దీ వారు మిమ్మల్ని మరింత వే ధిస్తారు,

## సైబర్ క్రైమ్ ఫిర్యాదు చేయాలి...

వెంటనే www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి లేదా 1930 నంబర్‌కు కాల్ చేయాలి, లేదా స్థా నిక పోలీస్ స్టేషన్ మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఆధా రాలతో (స్క్రీన్ షాట్స్, నంబర్లు) ఫిర్యాదు ఇవ్వాలి,మీ ఫోన్ హ్యాక్ అయిందని, ఎవరైనా మెసేజ్ చేస్తే నమ్మవద్దని మీ స్నేహితులకు, బంధువులకు ముందే చెప్పాలి, అవసరం ఎంత ఉన్నా,

కేవైసీ పేరుతో సైబర్ మోసాలు .. జాగ్రత్త ఇదే అవకాశంగా నేరస్థులు నకిలీ కాల్స్ చేస్తారని, ఎస్ ఎం ఎస్, లింకులను పంపుతారని, అలాంటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మీకు వచ్చే మెసేజ్ లను నమ్మొద్దని, అనుమానం ఉంటే నేరుగా బ్యాంకుకే వెళ్లి నిర్ధారించుకోవాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సందేశాన్ని గమనించి,. కేవైసీని నవీకరించుకోవాలన్నారు. కేవలం బ్యాంక్ యాప్స్ లేదా బ్రాంచ్‌ల ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. పాస్ వర్డ్స్ తరచూ మారుస్తూ జాగ్రత్తగా ఉండాలి ఒకే పాస్ వర్డ్ చాలా కాలం పాటు ఉంచకుండా పాస్‌వర్డ్‌లు తరచూ మారుస్తూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలలో అప్రమత్తతే అన్నిటి కన్నా ముఖ్యమని, కనుక ప్రజలు డిజిటల్ మోసాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

అపరిచిత లోన్ యాప్స్ జోలికి వెళ్లడం అం టే మన ప్రైవసీని వేలం వేయడమే, ఆకర్షణీయమైన ప్రక టనల వెనుక ఉన్న అసలు రంగును గుర్తించండి, "అప్రమ త్తంగా ఉండండి - సురక్షితంగా ఉండాలి" అయితే మరో వైపు "లోన్ యాప్ మోసాల అణిచివేతలో కేవలం వ్యక్తిగ త జాగ్రత్తలే సరిపోవు, ప్రభుత్వాలు, నియంత్రణ సంస్థల ఉక్కుపాదం అత్యవసరం, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (=దీ ×) ఇప్పటికే అనధికారిక యాప్‌లను గుర్తించి, వైట్ లిస్ట్‌లో లేని యాప్‌లపై నిషేధం విధిస్తోంది, గూగుల్ వంటి సంస్థల తో సమన్వయం చేసుకుంటూ ప్లేస్టోర్ నుండి ప్రమాదకర మైన యాప్‌లను తొలగించడం, సైబర్ క్రైమ్ విభాగం ద్వా రా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకు రావడం వంటివి ప్రభుత్వాల చిత్తశుద్ధికి నిదర్శనం, అయి తే, కేవలం చట్టాలే కాదు, అప్పు ఇచ్చే సంస్థల మూలాల ను వెతికి పట్టుకోవడంలో అంతర్జాతీయ సహకారం కఠిన మైన శిక్షలు అమలు చేయడం ద్వారానే ఈ మాఫియాను శాశ్వతంగా అంతం చేయగలము, ప్రజల రక్షణ కోసం య శీత్రాంగం సిద్ధంగా ఉన్నప్పటికీ, అపరిచిత లింక్‌ల పట్ల ప్ర తి పౌరుడు అప్రమత్తంగా ఉండి, బాధితులు ధైర్యంగా ఫి ర్యాదు చేసినప్పుడే ఈ డిజిటల్ విషవలయం ఛిన్నాభిన్నం అవుతుంది.



balagamtv100@gmail.com

# ఆస్కార్‌లో తళుక్కుమన్న వారణాసి హీరోయిన్-




## సెంటర్ అట్రాక్షన్ గా ఈషా అంబానీ

హాలీవుడ్‌లో బిగ్గెస్ట్ వేడుక.. ఆస్కార్ అవార్డుల సందడి గ్రాండ్‌గా ఆరంభమైంది. ఇది 98వ ఎడిషన్. భారత కాలమాన ప్రకారం ఈ తెల్లవా రు జామున సరిగ్గా 5:30 గంటలకు ఈ ప్రదా నోత్సవం ప్రారంభమైంది. అమెరికా కాలిఫోర్ని యాలోని డాల్బీ థియేటర్ దీనికి వేదిక. అమెరికాకు చెందిన ప్రముఖ కమేడియన్, రైటర్, టెలివిజన్ హోస్ట్ కానన్ ఓ'బ్రియాన్ ఈ కార్యక్రమానికి వ్యాఖ్యతగా వ్యవహరించారు. తన దైన శైలిలో నవ్వులు పూయించారు. కానన్..ఆస్కార్ కు కామెంటేటర్ గా వ్యవహరిం చడం వరుసగా ఇది రెండోసారి.భారత్ కు చెందిన హాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా ఈ కార్యక్రమంలో మెరిశారు. భర్త జొనాస్ తో కలిసి సందడి చేశారు. ఈ ఏడాది అవార్డులను అందించే వారిలో ఉన్నారామె. గత ఏడాది అవార్డులు గెలుచుకున్న వారిలో ది బ్రూటలిస్ట్ కు అడ్రియన్ బ్రాడీ, అనోరాకు మైకీ మాడిసన్, ఎమిలియా పెరెజ్ కు జో సల్డానా సైతం ప్రజెంటర్ల జాబితాలో నిలిచారు. వీరితో పాటు క్రిస్ ఎవాన్స్, విల్ ఆర్నెట్, చేజ్ ఇన్ఫినిటి, రాబర్ట్ డౌనీ జూనియర్, అన్నే హాథావ్వే, డెమి మూర్, కుమాయిల్ నంజియాని వంటి అగ్ర తారలు కూడా అవార్డులను అందించనున్నారు.రెండ్‌కార్పెట్‌పై ప్రియాంక చోప్రా- నిక్ జోనాస్ జంట మెరుపులు మెరిపించింది. ప్రియాంక స్ట్రాప్‌లెస్ వైట్ డియోర్ గౌన్ లో కనిపించారు. హై-లెగ్ స్లిట్, బ్లాక్ అండ్ వైట్ రఫుల్స్ ట్రెయిల్ దీని ప్రత్యేకత. అదే రేంజ్ లో బ్లాక్ హీల్స్, మిరుమిట్లు గొలిపే డైమండ్ నెక్లెస్, చెవిపోగులతో కంప్లీట్ మేకోవర్ అయ్యారు. క్లాసిక్ బ్లాక్ టక్సేడో, వైట్ షర్ట్, బ్లాక్ బో టై ధరించాడు నిక్. రెడ్‌కార్పెట్‌పై ఘన స్వాగతం లభించింది వీరికి.2016లో మొదటిసారి ప్రెజెంటర్‌గా వ్యవహరించారామె. 2021లో ఆస్కార్ తో అనుబంధం ఉన్నప్పటికీ.. అప్పట్లో నామినేషన్లను ప్రకటించడం వరకే పరిమితం అయ్యారు. సెలబ్రేషన్స్ ఆరంభానికి ముందు డ్రెస్సింగ్ రూమ్ నుండి కొన్ని ఫొటోలను విడుదల చేశారు. వైట్ గౌన్ లో పర్సనలైజ్డ్ ట్యాగ్, స్టైలిస్ట్ తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. ప్రస్తుతం ఆమె మహేష్ బాబు సరసన వారణాసిలో నటిస్తోన్నారు.ఇదే వేడుకకు ఈషా అంబానీ హాజరయ్యారు. ఓ వింటేజ్ లుక్ లో అదరగొట్టారు. మేసన్ వాలెంటినో డిజైన్ చేసిన గౌన్ ను ధరించారామె. ఫాల్ 2006 కౌచర్ కలెక్షన్ లో టాప్ లో నిలిచిందీ డిజైన్. లేత గులాబీ, ఐవరీ, నీలం, ఆకుపచ్చ రంగుల్లో ఫ్లోరల్ ఎంబ్రాయిడరీలో డిజైన్ చేశారు దీన్ని. ఆస్కార్ వేడుకలకు ముందు, ఈషా లాస్ ఏంజిల్స్‌లో మ్యూజియం డైరెక్టర్ అమీ హోమ్మాతో సమావేశమయ్యారు. ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్, ఆస్కార్ అకాడమీ మధ్య పలు అంశాలపై సంప్రదింపులు జరిపారు.

# ఎట్టకేలకు మనసులో మాట బయటపెట్టిన కాయదు లోహర్!



ప్రముఖ నటి కాయదు లోహర్ తన అందం తో నటనతో దక్షిణాది సినీ ప్రేక్షకుల ను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. మోడలింగ్ రంగం నుంచి సినిమా ప్రపంచంలోకి ప్రవేశించిన ఈ ముద్దు గుమ్మ.. అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపును సంపాదించు కున్నారు. టాలీవుడ్, దక్షిణాది చిత్రసీమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కాయదు లోహర్.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, కెరీర్ ప్రయాణం గురించి ఎంతో హుందాగా, సరదాగా ముచ్చటించారు. తన పెళ్లి, ప్రేమ జీవితంపై వస్తున్న ఊహాగానాలకు ఆమె తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారు. ఇంటర్వ్యూలో భాగంగా తన వైవాహిక జీవితం గురించి యాంకర్ అడిగిన ప్రశ్నకు కాయదు లోహర్ ఏ మాత్రం తడబడకుండా.. "అవును, నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను" అని చాలా స్పష్టంగా, నిజాయితీగా సమాధానమిచ్చారు. తన జీవితంలో పెళ్లి అనేది ఒక ముఖ్యమైన ఘట్టమని.. సరైన సమయం వచ్చినప్పుడు తప్పకుండా ఆ నిర్ణయం తీసుకుంటానని ఆమె పరోక్షంగా సూచించారు. ప్రస్తుతం కాయదు లోహర్ రిలేషన్ షిప్ స్టేటస్ గురించి అభిమానుల్లో ఎప్పుడూ ఆసక్తి ఉంటుంది. ఈ వీడియోలో.. "ప్రస్తుతం మీరు ఏ స్థితిలో ఉన్నారు? కమిటెడ్ ఆ లేక సింగిలా?" అని అడిగినప్పుడు.. ఆమె చాలా తెలివిగా తన కెరీర్ పట్ల ఉన్న నిబద్ధతను చాటుకున్నారు. "నేను ప్రస్తుతం నా పనికి కమిటెడ్" అంటూ ఆమె నవ్వుతూ ఇచ్చిన సమాధానం అందరినీ ఆకట్టుకుంది. తన వృత్తిని ఎంతగా ప్రేమిస్తుందో చెప్పడానికి ఈ సమాధానమే నిదర్శనం. ఈ ఇంటర్వ్యూ మొత్తం చాలా స్నేహపూర్వకంగా, నవ్వులతో సాగింది. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ప్రశ్నలను ఏ మాత్రం ఇబ్బంది పడకుండా ఎంతో హుందాగా స్వీకరించింది కాయదు లోహర్. కాయదు లోహర్ ముఖంలో కనిపించిన చిరునవ్వు, ప్రతి ప్రశ్నకు ఇచ్చిన జవాబులు ఇంటర్వ్యూకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తనను తాను ఎలా ప్రెజెంట్ చేసుకోవాలో కాయదుకి బాగా తెలుసని ఈ వీడియో చూస్తే అర్థమవుతుంది. చివరగా.. తన కెరీర్, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత గురించి మాట్లాడుతూ.. "నేను మీకు చాలా సింపుల్ అండ్ స్ట్రెయిట్ ఆన్సర్ ఇస్తున్నాను" అని చెప్పడం ద్వారా, తాను దేనికీ అతిగా ప్రాధాన్యత ఇవ్వకుండా, తన పనిని, జీవితాన్ని ఎలా ఆస్వాదిస్తుందో వివరించారు.



# ఏడడుగులు వేయబోతున్న స్టార్ బ్యూటీ అనుష్క శెట్టి..



## పెళ్లి కొడుకు ఫిక్స్ ??

సౌత్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి.. తనదైన శైలితో రెండు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తోంది. కన్నడలో జన్మించిన ఈ భామ.. 2005లో నాగార్జున హీరోగా వచ్చిన సూపర్ చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఆ తరువాత విక్రమార్కుడు, లక్ష్యం, శౌర్యం, చింతకాయల రవి, కింగ్, బిల్లా, ఖలేజా, రగడ, ఢమరుకం, మిర్చి, సైజ్ జీరో, ఊపిరి, భాగమతి వంటి హిట్స్‌తో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో స్థానం సంపాదించింది. ముఖ్యంగా అరుంధతితో లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారగా.. బాహుబలి సిరీస్‌తో పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు పొందింది. ఇటీవల మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి, ఘాటీ చిత్రాల్లో నటించారు. అలాగే మలయాళంలో కథనార్ అనే సినిమాలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఇంకా కొన్ని సినిమాల కథలు చర్చల దశలో ఉన్నాయని తెలుస్తుంది. అయితే అనుష్క పర్సనల్ లైఫ్ గురించి గత కొన్నేళ్ళుగా రకరకాల రూమర్లు వస్తూనే ఉంటున్నాయి. కానీ తనపై వస్తున్న వార్తల పట్ల ఇంత వరకు ఎప్పుడూ స్పందించలేదు. అయితే కొద్దికాలంగా మీడియాకు, ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్న స్వీటి త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారని సోషల్ మీడియా కోడై కూస్తుంది. అయితే అనుష్క తన సహచర నటుడు, పాన్ ఇండియా స్టార్ హీరోతో ప్రేమలో ఉన్నారని.. త్వరలోనే పెళ్లి కూడా చేసుకుంటారని కూడా వార్తలు వచ్చాయి. ఆ విషయంపై సదరు హీరోగానీ.. అనుష్క ఎప్పుడూ మాట్లాడలేదు. కానీ ఆ హీరో ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉండడం.. పెళ్లి గురించి పెద్దగా పట్టించుకోకపోవడం పట్ల అనుష్క కుటుంబ సభ్యులు మండిపడుతున్నారని సినీ వర్గాలలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ఫ్యామిలీ ఒత్తిడి కారణంగా ఈ ఏడాదిలో అనుష్క పెళ్లి చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు చర్చ జరుగుతోంది. తన ఫ్యామిలీలోనే దగ్గర రిలేషన్ వ్యక్తితో పెళ్లి జరగనుందని అనుకుంటున్నారు. అంతే కాకుండా అనుష్క వివాహం చేసుకోబోతున్న బిజినెస్ మ్యాన్ అని అనే వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. మరి ఈ వార్తల్లో వాస్తవం ఎంత? అనేది తేలాలంటే అనుష్క తరపు నుంచి ఏదైనా స్పందన వస్తే తెలుస్తుందని అభిప్రాయపడుతున్నారు.


# స్టార్ హీరోకి ఆ హీరోయిన్ సెంటిమెంట్..

### ఒక్క పైసా తీసుకోకుండా సినిమాకి ఓకే !!



బాలీవుడ్ "బాద్‌షా".. షారూఖ్ ఖాన్ గురించి కొత్తగా పరిచయం అక్కర్లేదు. ఏ బ్యాగ్రౌండ్ లేకుండానే చిత్ర పరిశ్రమ లోకి ఎంట్రీ ఇచ్చి "కింగ్ ఖాన్"గా ఎదిగారు. 1992లో 'దీవానా' చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీఇచ్చి తొలి చిత్రంతోనే అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ తర్వాత హీరోగానే కాకుండా నెగటివ్ పాత్రలతో కూడా అదరగొట్టి క్రేజ్ ను పెంచుకోగలిగారు. ఇక 'దిల్వాలే దుల్హనియా లే జాయేంగే' (ఊఊజీ), 'కుచ్ కుచ్ హోతా హై', 'దేవదాస్', 'వీర్-జారా' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలతో ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది అభిమానులను సంపాదించుకున్నారు. అలానే 'స్వదేశ్', 'చక్ దే ఇండియా', 'మై నేమ్ ఈజ్ ఖాన్' వంటి చిత్రాల ద్వారా నటుడిగా తన సత్తా చాటారు.ఇక ఇటీవల కాలంలో పలు చిత్రాలు వరుసగా ఫ్లాప్ అయినప్పటికీ.. 2023లో 'పఠాన్', 'జవాన్' సినిమాలతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించారు. కానీ "ఢంకీ" సినిమాతో కొంచెం ఢీలా పడ్డ షారూఖ్.. ఈసారి గట్టి కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. ఇటీవల 'జవాన్' చిత్రానికి గాను ఆయన జాతీయ ఉత్తమ నటుడి అవార్డును కూడా అందుకున్నారు. స్తుతం డైరెక్టర్ సిద్ధార్థ్ ఆనంద్ తో చేతులు కలిపి "కింగ్" సినిమా చేస్తున్నారు షారుఖ్. 2026 డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా 'కింగ్' సినిమా థియేటర్లలోకి రానుంది.అంతే కాకుండా కింగ్ సినిమాలో హైలైట్ గా నిలిచే మరో అంశం ఏంటంటే.. ఈ చిత్రంలోనే షారుక్ ఖాన్ కూతురు సుహానా ఖాన్ వెండితెరకు పరిచయం కాబోతోంది. ఇప్పటికే "ది ఆర్చీస్" అనే ఓటీటీ మూవీలో మెరిసిన సుహానా.. ఇప్పుడు తన తండ్రితో కలిసి పూర్తిస్థాయి యాక్షన్ రోల్‌లో కనిపించనుంది. రియల్ లైఫ్ తండ్రీకూతుళ్లు.. రీల్ లైఫ్‌లో కూడా ఎలాంటి మ్యాజిక్ చేస్తారని అభిమానులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ చిత్రం కోసం కూడా షారూఖ్ ఖాన్ తనకు బాగా కలిసొచ్చిన విషయాన్ని ఫాలో అవుతున్నారట.
హిందీ చిత్ర పరిశ్రమలో ఆన్ స్క్రీన్ బెస్ట్ పెయిర్ గా నిలిచిన వారిలో షారూఖ్ ఖాన్ - దీపికా పదుకునే జంట ఒకటి. ఓం శాంతి ఓం నుంచి మొదలై.. పఠాన్, జవాన్ వరకు సక్సెస్ ఫుల్‌గా సాగింది. అందుకే ఆమెను తన లక్కీ ఛామ్‌గా ట్రీట్ చేస్తున్నారట షారూఖ్. అందుకే ఈ మూవీలో ఈ స్టార్ బ్యూటీ ఒక ముఖ్య పాత్ర పోషిస్తున్నారని జోరుగా చర్చ నడుస్తోంది. ఇందులో దీపికా సుహానాకు తల్లి క్యారెక్టర్ చేయబోతోందని టాక్ వినిపిస్తుంది.అయితే ఈ చిత్రంలో దీపికా పాత్ర ఎక్కువ సేపు ఉండదని సమాచారం. కానీ షారూఖ్ కోసం వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని సినీ వర్గాలలో చర్చ జరుగుతోంది. మరోవైపు ప్రస్తుతం సినిమాకు రూ.25 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటోన్న దీపికా.. షారూఖ్‌తో ఉన్న ఫ్రెండ్ షిప్ కొద్ది రెమ్యునరేషన్ తీసుకోకుండా వర్క్ చేస్తానందట. దీంతో ఈ వ్యవహారం టాక్ ఆఫ్ ది టౌన్ గా మారిపోయింది. చూడాలి మరి షారుఖ్ సెంటిమెంట్ వర్కౌట్ అవుతుందా ? లేదా ?? అని.

# నమో నమో నారాయణే..



ప్రసిద్ధ దేవాలయాలు, నేలమాళిగలు, నిధి నిక్షేపాలు.. తదితర అంశాల మేళవింపుగా రూపొందుతున్న పానిండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. విరాట్‌కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలు. నిర్మాణ దశలో ఉన్న ఈ సినిమా వేసవిలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా 'నమోరే.. నమో నమోరే.. నమో నమో నారాయణే..' అంటూ సాగే భక్తిరసాత్మక గీతాన్ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. ఆధ్యాత్మికత, కళాత్మకత ప్రతిబింబించేలా ఈ పాట రూపొందింది.విష్ణుదేవుని స్తుతిగా తయారైన ఈ గీతాన్ని శ్రీహర్ష ఈమని రాయగా, జునైద్‌కుమార్, అభే స్వరపరిచారు. సింధూజా శ్రీనివాసన్, ఐశ్వర్య దారూరి ఆలపించారు. గణేశ్ ఆచార్య, శ్రేష్ఠి వర్మ కొరియోగ్రఫీ అందించారు. రెండువేలమంది నర్తకీమణులు ఈ పాటలో భాగమయ్యారు. నభా నటేష్, దక్ష నగార్కర్ హావభావాలు, నాట్యవిన్యాసాలు పాటకు ఆకర్షణగా నిలిచాయి. తిరువనంతపరం పద్మనాభస్వామి ఆలయాన్ని తలపించేలా కళాదర్శకుడు అశోక్‌కుమార్ వేసిన సెట్ పాటకు నిండుదనాన్ని తెచ్చింది. ఈ చిత్రానికి నిర్మాణం: చీ×ఖ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్.

# వేగం కంటే క్వాలిటీ ముఖ్యం



మంచి కంటెంట్ ఉన్న చిత్రాల్లో నటిస్తూ యువహీరోల్లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుని తెచ్చుకున్నారు ఆనంద్ దేవరకొండ. ముఖ్యంగా 'బేబీ' సినిమా ఆయన కెరీర్‌లోనే ఓ మైలురాయి అని చెప్పక తప్పదు. ప్రస్తుతం ఎపిక్, డ్యూయెట్ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారాయన. ఆదివారం ఆనంద్ దేవరకొండ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'వేగంగా సినిమాలు చేయడం కంటే క్వాలిటీగా సినిమాలు చేసేందుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. చేసే ప్రతి పాత్రకూ వేరియేషన్, ఎంచుకునే ప్రతి కథకూ స్ట్రాంగ్ కంటెంట్ ఉండేలా చూసుకుంటున్నాను.నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో ఓ మంచి స్థానాన్ని సంపాదించుకోవడమే నా లక్ష్యం' అన్నారు ఆనంద్ దేవరకొండ. సితార ఎంటర్‌టైన్మెంట్స్‌లో తాను చేస్తున్న 'ఎపిక్' సినిమా ఒక విభిన్నమైన ప్రేమకథ అని, కేవలం ప్రమోషనల్ కంటెంట్‌తోనే ఈ సినిమా ఆడియన్స్‌లో బజ్‌ని క్రియేట్ చేయడం చాలా ఆనందంగా ఉందని, దర్శకుడు ఆదిత్యహాసన్ ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారని ఆనంద్ తెలిపారు. అలాగే మిథున్ వరదరాజ కృష్ణన్ దర్శకత్వంలో తాను చేస్తున్న 'డ్యూయెట్' సినిమా కూడా చాలా కొత్తగా ఉంటుందని ఆనంద్ పేర్కొన్నారు.